GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
బుధవారం 19-08-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్




ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫారాలు తయారు చేసేందుకు వినియోగించాల్సిన వస్త్రాలు హత్నూర ఐకెపి కార్యాలయంలో మూలన పడేసి ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని విద్యార్థులకు సమయానికి యూనిఫారాలు అందించాల్సిన వస్త్రాలను భద్రంగా నిల్వ చేయాల్సిన అధికారులు వాటిని పట్టించుకోకుండా కార్యాలయంలోనే వృథాగా పడేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు



# లక్డారం భూముల్లో అక్రమ భూసేకరణ ఆపాలి: సిపిఎం

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 18:**

లక్డారం గ్రామంలోని సర్వే నంబర్ 498లో 22 ఎకరాల 31 గుంటల భూమిలో రెవెన్యూ అధికారుల సహకారంతో పోలీసు యంత్రాంగం చేపడుతున్న ఫెన్సింగ్, భూసేకరణ పనులను వెంటనే నిలిపివేయాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం లక్డారం గ్రామానికి వెళ్లి దళిత రైతులతో కలిసి భూ సమస్యపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 1970లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం లక్డారం గ్రామానికి చెందిన 25 మంది రైతులకు ఒక్కో ఎకరం చొప్పున భూములు కేటాయించిందన్నారు. ప్రస్తుతం ఎస్టీపి ప్లాంట్ ఏర్పాటులో భాగంగా 10 ఎకరాలు కేటాయిస్తున్నామని ప్రభుత్వం చెబుతూ, రైతుల భూముల వద్ద ఫెన్సింగ్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, గ్రామసభ నిర్వహించకుండా పోలీసు బలగాలతో ఫెన్సింగ్ వేయడం రైతులను భయభ్రాంతులకు గురి చేయడమేనన్నారు. లక్డారం రైతుల భూ సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు కొనసాగుతోందని, ఈ నెల 20న విచారణ ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ అవసరాల కోసం భూములు తీసుకోవాలంటే నోటీసులు జారీ చేసి, గ్రామసభ నిర్వహించి, నష్టపరిహారంపై చర్చించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఈ ప్రక్రియను పాటించకుండా ముందుకు సాగుతోందని ఆరోపించారు. లక్డారం దళిత రైతులకు న్యాయం జరిగే వరకు రాజకీయ పార్టీలు, దళిత ప్రజా సంఘాలను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలు కొనసాగిస్తామని నాగేశ్వరరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కే. మల్లేష్, మాణిక్ ప్రభు, లక్ష్మయ్య, బలరాం, జీవన్ కుమార్, రవి, శ్రీనివాస్, వెంకటమ్మ, నవనీత, అంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం.. నిందితుడికి కఠిన శిక్ష

- మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో న్యాయస్థానం కీలక తీర్పు
- 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా
- దర్యాప్తు అధికారుల పటిష్ట ఆధారాలతో నేరం రుజువు
- సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు

4లో

# సొమ్ము కేంద్రానిది సోకు రాష్ట్రానిది.

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పెగడపెల్లి: కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి ఫోటోతో సహా కేంద్ర ఆహార శాఖ మంత్రి ఫోటోలు కచ్చితంగా ముద్రించాల్సిందేనని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ డిమాండ్ చేశారు. అసలే తెలంగాణ రాష్ట్రం అప్పులతో నడుస్తుంటే కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు అంటూ 600 కోట్ల ప్రజాధనాన్ని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందంటూ పాత రేషన్ కార్డుల వల్ల ఎప్పుడైనా ప్రజలకు బియ్యం పంపిణీ ఏనాడైనా ఆగిందా అంటూ ప్రశ్నించారు.వన్ నేషన్ వన్ రేషన్ పద్ధతి ద్వారా దేశంలోని ఏ రేషన్ దుకాణం ద్వారానైనా సరుకులు తీసుకునే సౌకర్యం కల్పిస్తే ప్రధానమంత్రి కేంద్ర ఆహార శాఖ మంత్రి ఫోటోలను ఎందుకు ముద్రించడం లేదన్నారు.ప్రతి లబిదారుడికి ఇచ్చే ఆరు కిలోల బియ్యం లో ఐదు కిలోలు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేవేనని కేవలం ఒక కిలో ఇచ్చి ఇత్తువేసి పొత్తు కలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఫోటోలు మాత్రమే ముద్రించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేసిందని ఒక్క తెలంగాణ ప్రభుత్వం మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తుందని దొడ్డు రకం బియ్యం 30 రూపాయలు ఉంటే సన్న రకం బియ్యం 50 రూపాయలు ఉందని వీటి మధ్య ఉన్న వ్యత్యాసం 20 రూపాయలు




రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని అన్నారు.భారత ఆహార భద్రత చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తేనే రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లు కొనుగోలు చేస్తుందని అట్టివడ్లను మిల్లింగ్ చేసి లబ్ధిదారులకు అందిస్తున్నందుకు కేంద్రం రాష్ట్రానికి కమిషన్ చెల్లిస్తుందని ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర శూన్యమని వడ్ల కొనుగోలు సమయంలో సంచి, దబ్బునం, సుతిలి,హామాలి ఖర్చులతో సహా కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ఇది దాచి రాష్ట్ర ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేట అన్నారు. గతంలో పంపిణీ చేసిన రేషన్ సరుకుల బ్యాగులపై కూడా ప్రధానమంత్రి కేంద్ర ఆహార శాఖ మంత్రి ఫోటోలు ముద్రించకపోవడం దారుణమని ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ముందు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎంతెంత అనే వివరాలతో ప్రధానమంత్రి కేంద్ర ఆహార మంత్రి ఫోటోలతో సహా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కొత్తగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ కార్డులపై వీరి ఇరువురి ఫోటోలు ముద్రించాల్సిందేనని డిమాండ్ చేశారు.

# 22-ఏ జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా భూములను పరిశీలిస్తాం

**ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు**

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్,రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ;** 22-ఏ జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22-ఏ జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22-ఏ జాబితా, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, భూ రికార్డుల సవరణ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ.. 22-ఏ జాబితాలో నమోదైన భూములకు సంబంధించి కొన్ని సందర్భాల్లో పాత, కొత్త సర్వే నంబర్లలో జరిగిన మార్పులు, భూముల సరిహద్దులు, విభజన తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. పాత సర్వే నంబర్ల ఆధారంగా ఉన్న భూములు, అనంతరం వచ్చిన సర్వే నంబర్లలో మిగిలిపోయిన భూములు, సరిహద్దుల విషయంలో స్పష్టత అవసరమైన అంశాలను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే హైకోర్టు, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల తీర్పులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే నంబర్లు, సర్వే రికార్డులు, ఇతర ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని సూచించారు. కేవలం ఒక్క రికార్డును ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా, సంబంధిత అన్ని రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములపై ప్రత్యేక పరిశీలన**

పట్టణ ప్రాంతాల్లో గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ కు సంబంధించిన భూములు కూడా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వాటికి సంబంధించిన రికార్డులను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ముఖ్యంగా జీవో 765



ఆధారంగా గతంలో జరిగిన చర్యలు, డిప్రెషన్/విముక్తి తదితర అంశాలను పరిశీలించి, అర్హత ఉన్న భూముల విషయంలో నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గతంలో భూ రికార్డులను సవరించుకోని వారు లేదా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయని వారు నిబంధనల ప్రకారం సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి తమ భూ రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

**హెచ్ ఎం డి ఏ పరిధిలోని భూములపైనా పరిశీలన**

హెచ్ ఎం డి ఏ పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వానికి చెందిన భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా 22-ఏ పరిధిలోకి వచ్చే భూములను మాత్రమే నిబంధనల ప్రకారం గుర్తించి జాబితాలో ఉంచాలని స్పష్టం చేశారు. జెన్యూన్ పట్టా భూమి ఏదైనా పొరపాటున 22-ఏ జాబితాలో నమోదై ఉంటే ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అటువంటి భూములను కూడా త్వరలో పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం అని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సరిహద్దులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.



# పిల్లల యూనిఫాం వస్త్రాలు ఎలుకల పాలు..!

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 18:** చాలా కాలంగా కార్యాలయంలోని ఓ మూలన ఎలాంటి సంరక్షణ లేకుండా వస్త్రాలను పడేసి ఉంచడంతో వాటిపై దుమ్ము, ధూళి పేరుకుపోవడంతో పాటు ఎలుకలు కొరికి చిల్లులు పడే పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన వస్త్రాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫారాలు అందించేందుకు అవసరమైన వస్త్రాలు ముందుగానే అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని సక్రమంగా వినియోగించకుండా కార్యాలయంలో మూలన పడేయడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల అవసరాల కోసం కేటాయించిన సామగ్రిని సంరక్షించాల్సిన అధికారులు కనీసం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఐకెపి కార్యాలయంలో ఇలా వస్త్రాలు పడి ఉన్న విషయం అధికారుల దృష్టికి రాలేదా? వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వస్త్రాలు పాడైపోయేలోపు వాటిని వెంటనే పరిశీలించి, యూనిఫారాల తయారీకి వినియోగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి**

విద్యార్థులకు ఉపయోగపడాల్సిన వస్త్రాలు ఎలుకల పాలవకుండా అధికారులు తక్షణమే స్పందించాలని, నిల్వలను పరిశీలించి నాణ్యతను కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. బాధ్యుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, వస్త్రాలను సకాలంలో విద్యార్థుల యూనిఫారాల తయారీకి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఐకెపి కార్యాలయంలో మూలన పడి ఉన్న వస్త్రాలే సాక్ష్యమని స్థానికులు మండిపడుతున్నారు.

**ఐకెపి డిపిఎం చింతకింది వెంకటేశం:**

ఇట్టి విషయాన్ని డిపిఎమ్ చింతకింది వెంకటేశం ను వివరణ కోరగా తాను రెండు రోజులు ట్రైనింగ్ లో ఉంటానని ఎపిఓ హత్నూర తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.





## జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు చీరల పంపిణీ

**కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి: వినోద్ యాదవ్**

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** బోనాల పండుగ పురస్కరించుకుని మౌలాలి డివిజన్ కాంగ్రెస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పోతుల ఉమా మహేశ్వరి వినోద్ యాదవ్ మౌలాలి ప్రాంతంలోని జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ వారికి చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన రోగాలు ప్రబలకుండా ఉంటాయన్నారు. డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యలకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.

## తుర్కలపల్లిలో రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మండలంలోని తుర్కలపల్లి గ్రామంలో ఎటీఏంఎ కార్యక్రమం ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులు, వివిధ పంటల్లో సమగ్ర చీడపీడల యాజమాన్య నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల మార్పిడి, నేల ఆరోగ్యం పరిరక్షణ, మిశ్రమ పంటల సాగు, ఆయిల్‌పామ్‌లో అంతర పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి యాజమాన్యం, కలుపు మొక్కల నియంత్రణ, ఎరువుల వినియోగం, చీడపీడల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. పంటలలో తెగుళ్లు, చీడపీడలను ముందస్తుగా గుర్తించి సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగూరి లత శేఖర్‌రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు కె. మంజుల, మండల వ్యవసాయ అధికారి ఎస్. సురేష్, ఏఈఓ కృష్ణయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



# మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్

- మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** కొల్లాపూర్ నియోజకవర్గంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంతో పాటు, వారికి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రెవెన్యూ, ఐకేపీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లి గ్రామ శివారులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 119లో ఉన్న సుమారు 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన ఆయన, ప్లాంట్ ఏర్పాటుకు ఆ స్థలం ఎంతవరకు అనుకూలంగా ఉంటుందనే అంశంపై అధికారులతో చర్చించారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థల స్వరూపం, రహదారి సౌకర్యం, విద్యుత్ ప్రసారానికి ఉన్న అవకాశాలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ వనరు సమకూరే అవకాశం ఉందని, అందుకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాన్ని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. సంప్రదాయ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని, ప్రతిపాదిత సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యాసాధ్యాలను అంచనా వేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, స్థల ఎంపిక, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ప్రసారం తదితర అంశాలపై పూర్తి వివరాలతో ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, ఎంపీడీఓ, ఐకేపీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు బిఆర్ఎస్ నాయకులు



**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** మల్కాజ్గిరి కి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు ఏ కే మురుగేష్, టిఎన్ కృష్ణ గౌడ్, జెగ్ మహేష్ గౌడ్, ఎల్లేష్ శ్రీనివాస్ రెడ్డిలతో పాటు సుమారు 30 మంది బి ఆర్ ఎస్ నాయకులు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకర్షితులై మల్కాజ్గిరి చెందిన ఉద్యమకారులు సీనియర్ నాయకులు కాంగ్రెస్లో చేరడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 23వ తారీకు మల్కాజిగిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో ఉద్యమకారులతోపాటు పలువురు జాయిన్ అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండా నిరంజన్, యోగేందర్ ఆకుల శ్రీనివాస్ గౌడ్ మల్లికార్జున్ నగర్ దేవి, ఈశ్వర్, బాలరాజు, సూరి, మల్లారెడ్డి తో పాటు పలువురు జాయిన్ అవ్వడం జరిగింది.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాగించిన పోరాటాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని, అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం సమాజానికి చిరస్మరణీయమని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని కొనియాడారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, హక్కులు లభించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా, ఆయన చూపిన సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని, సమాజంలో వివక్షకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన కృషిని నేటి తరానికి తెలియజేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, బిసి సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గౌడ కుల సంఘాల నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులర్పించారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం..నిందితుడికి కఠిన శిక్ష

- మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో న్యాయస్థానం కీలక తీర్పు
- 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా
- దర్యాప్తు అధికారుల పటిష్ట ఆధారాలతో నేరం రుజువు
- సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు ఎలగొండ నవీన్‌కు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ జె. జీవన్‌కుమార్ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

**ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం..!!**

2021లో భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలానికి చెందిన మైనర్ బాలిక హనుమకొండలో ఇంటర్ చదువుతున్న సమయంలో, ములుగు జిల్లా మల్లూరు శివారు మొట్లగూడెం గ్రామానికి చెందిన ఎలగొండ నవీన్‌తో సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుందామని చెప్పి 2021 ఏప్రిల్ 3న బాలికను ఇంటి నుంచి బయటకు పిలిపించాడు. బాధితురాలు కాటారం మండలం బస్వాపూర్‌కు చేరుకోగా, నిందితుడు ఆమెను ములుగు జిల్లా పస్రా మీదుగా బర్లగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి అక్కడ కొన్ని రోజుల పాటు నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన స్వగ్రామమైన మొట్లగూడెంకు తీసుకెళ్లి అక్కడ కూడా బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. కుమార్తె కనిపించకపోవడంతో బాధితురాలి తండ్రి కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం బాధితురాలు ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది.

**పటిష్ట ఆధారాలతో చార్జిషీట్..**

బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సాంబమూర్తి కేసు నమోదు చేశారు. అప్పటి కాటారం డీఎస్పీ బోనాల కిషన్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో సేకరించిన పటిష్టమైన సాక్ష్యాధారాలతో నిందితుడిపై న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు




విచారణ సందర్భంగా లైజన్ అధికారి జి. వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి కె. రమేష్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్‌రావు, వెంకట్రామ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

**పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు**

కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన ప్రస్తుత కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్ఐ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ అధికారి పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రాజు, లైజన్ అధికారి జి. వెంకన్న, కోర్టు డ్యూటీ అధికారి కె. రమేష్‌తో పాటు అప్పటి దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణంలో కీలక ఘట్టం..!!

- నిపుణుల పర్యవేక్షణలో పాత గర్భగుడి నిర్మాణం తొలగింపు
- రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి
- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో కీలక ఘట్టం చోటుచేసుకుంది. ఆలయ పాత గర్భగుడి నిర్మాణాన్ని నిపుణుల పర్యవేక్షణలో జాగ్రత్తగా పూర్తిగా తొలగించారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగానే పాత నిర్మాణాన్ని తొలగించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కాళేశ్వరం ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఆలయ చైర్మన్ అవధాని మోహన్‌శర్మ, ఈఓ మహేష్, ఆర్‌అండ్‌బీ డీఈఈ దేవేందర్ ఆధ్వర్యంలో నిపుణుల సూచనలు, పర్యవేక్షణతో పోక్లెయినర్ సహాయంతో పాత గర్భగుడి నిర్మాణాన్ని తొలగించారు. నిర్మాణాన్ని తొలగించే సమయంలో ఆలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

**రూ.198 కోట్లతో అభివృద్ధి పనులు**

చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన కాళేశ్వరం ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనుల కోసం రూ.198 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణంతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, ఆలయ పరిసరాల అభివృద్ధి, ఇతర సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టనున్నారు. దీంతో కాళేశ్వరం ఆలయం భవిష్యత్‌లో మరింత వైభవంగా రూపుదిద్దుకోనుంది.






# ఆగస్టు 24 నుంచి ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి :** ఆగస్టు 24వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు దేశం సైదులు పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం సైదులు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న సమ్మెకు అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాలని కోరారు. ఆటో రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరం రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని ఆయన అన్నారు. సమ్మెను విజయవంతం చేసేందుకు ఆటో కార్మికులంతా ఐక్యంగా కదిలి రావాలని దేశం సైదులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆటో కార్మికులు ఎస్.కె. అమీర్, రాజేష్, ఓర్సు బాలస్వామి, మహేష్, నాగరాజు, లక్ష్మీకాంత్ రెడ్డి, యాదగిరి, జనార్ధన్, పరశురాం గౌడ్, మురళి, శ్రీను పాల్గొన్నారు.

# బహుజనుల అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి సర్వాయి పాపన్న గౌడ్



**మునుగోడు క్రైమ్ మిర్రర్ ఆగస్టు 18 :** మొఘల్ సామ్రాజ్య ఆధిపత్యాన్ని, స్థానిక జాగీర్దారులు, జమీందారులు అరాచకాలను గెరిల్లా యుద్ధతంత్రంతో ఎదురించి, గోల్కొండ కోటపై విజయ పతాకాన్ని ఎగురవేసి తొలి బహుజన రాజ్య స్థాపకుడుగా సర్దార్ సర్వార్ పాపన్న గౌడ్ నిలిచాడని మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి,మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి కా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ స దర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు.సమాజంలో అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఏకం చేసి ఆయన ఒక శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించారన్నారు.అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్నగౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజనుల అభ్యున్నతికి,సమాజంలో సమానత్వం కోసం కృషి చేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు.పాలకూరి నరసింహ గౌడ్,సురిగి చలపతి గౌడ్, పాలకూరి యాదయ్య గౌడ్, నకిరేకంటి యాదయ్య గౌడ్, అనంత స్వామి గౌడ్,మాధగోని రాజేష్ గౌడ్,అయితగోని లాల్ బహదూర్ గౌడ్, బొడ్డు నాగరాజ్ గౌడ్, మాధగోని నరేందర్ గౌడ్, పోలగోని ప్రకాష్ గౌడ్, ఈదులకంటి కైలాస్ గౌడ్, గోపగోని పాపయ్యగౌడ్, ఐతగోని విజయ్ గౌడ్, జాజుల స్వామి గౌడ్, సురిగి నరసింహ గౌడ్, కాటం వెంకన్న గౌడ్, అనంత శ్రీను గౌడ్, జాజుల లక్ష్మయ్య గౌడ్, మాధగోని గణేష్ గౌడ్, మునుకుంట్ల గోపాల్ గౌడ్, శ్రీశైలం గౌడ్,సైదులు గౌడ్, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.



## చిట్యాలలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి


**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు మారగోని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడని, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం కోసం చేసిన పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.. 376వ జయంతి వేడుకలు

**తెలంగాణ విప్లవ వీరుడి జయంతి.. పాపన్న గౌడ్‌కు గుండాల ఘన సత్కారం!**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 18 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ విప్లవ వీరుడు, బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గుండాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని పలువురు కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన పాపన్న గౌడ్ చరిత్రను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధగాని రామచంద్రయ్య, పొడిచెట్టి వెంకన్న, కొమ్మాయిపల్లి బాలరాజ్, ఏలికట్టి సోమయ్య, గిరకత్తుల శ్రీనివాస్, బుసిగంప పరశురాములు, అంబటి సోమయ్య, దంతూరి మల్లయ్య, ఒలంధాస్ ప్రభాకర్, చంద్రగిరి వెంకన్న, గంగాపురం ఉప సర్పంచ్ ఎలికట్టి మల్లయ్య, ఏలికట్టి చిన్న మల్లయ్య, చంద్రగిరి అంజయ్య, ఎలికట్టి ముత్తయ్య, గుండాల ఉప సర్పంచ్ ఆవుల సాయిప్రసాద్, గుండాల గ్రామ శాఖ అధ్యక్షుడు కొడపర్తి భాస్కర్, సింగిల్ విండో డైరెక్టర్ దూదిగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# దళితుల భూముల్లో ఎస్టీపీ వద్దు: ఎమ్మార్పీఎస్

- లక్డారం రైతులకు అండగా ఉంటాం
- ఎమ్మార్పీఎస్ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత
- రైతులకు అన్యాయం చేస్తే ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయాల ముట్టడిస్తాం






**హాట్ కామెంట్:**

"అభివృద్ధి పేరుతో రైతుల హక్కులను తొక్కిపెట్టడం సరికాదు. ముందుగా రైతులతో చర్చించి, చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి. దళిత రైతుల భూములు, జీవనాధారాన్ని కాపాడాలి."

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 18:** లక్డారం గ్రామంలోని దళిత రైతుల భూముల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) ఏర్పాటు చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత అన్నారు. దళిత రైతుల భూములు కోల్పోకుండా ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని ఆమె తెలిపారు. మంగళవారం వారం గీత లక్డారం దళిత రైతుల భూములను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పేరుతో దళితుల జీవనాధారమైన భూములను లాక్కోవడం సరికాదన్నారు. రైతులతో చర్చించకుండా భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. రైతులకు అన్యాయం జరిగితే ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పెద్ద గీత తెలిపారు. లక్డారం భూముల వ్యవహారంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కూడా ఆరా తీస్తున్నారని వెల్లడించారు.

### హైకోర్టును ఆశ్రయించిన రైతుల తరఫు న్యాయవాది

ఇదిలా ఉండగా, లక్డారం రైతుల భూములకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్ మంగళవారం రైతుల తరఫున లంచ్ మోషన్ దాఖలు చేశారు. సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారులు రైతుల పొలాల వద్దకు వచ్చి పంటలను నాశనం చేశారనే అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతుల హక్కులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోర్టును కోరినట్లు పేర్కొన్నారు.

### భూముల స్వాధీనంపై ఉద్రిక్తత

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారం గ్రామంలో సర్వే నంబర్ 498లోని సుమారు 21 ఎకరాల 31 గుంటల భూముల్లో ఎస్టీపీ ఏర్పాటుపై వివాదం కొనసాగుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు భూములను స్వాధీనం చేసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ, ఆదేశాలను చూపలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులు, అధికారులు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ భూములపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించామని, ఆగస్టు 20న విచారణ ఉన్న నేపథ్యంలో ముందుగానే భూముల స్వాధీనానికి ప్రయత్నించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే కోర్టు కేసు, ఆదేశాలపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను ఎస్టీపీ కోసం తీసుకోవడం వల్ల తమ జీవనాధారం దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయం తీసుకున్న తర్వాతే ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులతో చర్చించి న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# అవినీతి చేసినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తా

- చండూరు మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు



**చండూరు,క్రైమ్ మిర్రర్:** చండూరు మున్సిపాలిటీలో మంగళవారం ప్రభుత్వ అతిథి గృహం నందు స్థానిక మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మరియు కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రభుత్వ వ్యతిరేక ధర్నాలో చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలపై వాస్తవాలను ప్రజలకు వివరించకుండా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కొన్ని దశాబ్దాల కాలంగా బస్సు షెల్టర్ల కోసం ఎదురుచూస్తున్న చండూరు ప్రజల వారికోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు తమ తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో బస్ షెల్టర్ నిర్మాణం ప్రారంభిస్తే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రజలకు అది అవసరం లేదని మాట్లాడటం, దాని నిర్మాణం మొదట పండ్ల బండ్ల దగ్గర నిర్మిస్తామని చెప్పి వారి దగ్గర 12 లక్షలు తీసుకున్నారని ఆరోపించడం, స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ డబ్బులు తీసుకున్నారని, వైన్ షాపుల దగ్గర, పండ్ల బండి వారి దగ్గర, ప్రైవేట్ హాస్పిటల్స్ వద్ద, కాంట్రాక్టర్ల దగ్గర, రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర లక్షల రూపాయలు తింటున్నారని దేవుని దగ్గర ప్రమాణం చేస్తానని మాట్లాడారని, మీ మాట ప్రకారం మేము శనివారం రోజు ఉదయం 9:00 గంటలకు నేను, మున్సిపాలిటీ పాలకవర్గం అందరం మేము ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని ప్రమాణం చేస్తామని, మేము డబ్బులు తీసుకున్నట్లు మీరు ప్రమాణం చేయాలని అన్నారు. ఎక్కడైనా ఒక రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే నేను చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని, రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటానని... నువ్వు రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా కావడానికి సిద్ధమా అని అన్నారు. కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షులు ఐతరాజు మల్లేష్ మాట్లాడుతూ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఒక మాజీ ఎమ్మెల్యే అని మరిచిపోయి, కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్నారని, కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే చండూరులో అడుగుపెట్టనివ్వబోమని అన్నారు. పండ్ల బండి వ్యాపారులు, వైన్స్ యాజమాన్యం ప్రెస్ మీట్ లో పాల్గొని ఎవరికీ ఎవరు కూడా ఒక రూపాయి ఇవ్వలేదని, మున్సిపల్ చైర్మన్ పై అబాండాలు మోపితే సహించమని, మేమందరం శనివారం గుడికి వచ్చి డబ్బులు ఎవరికి ఇవ్వలేదని ప్రమాణం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బూతరాజు దశరథ, కౌన్సిలర్లు బుషిపాక వాసు, కోడి సుష్మ వెంకన్న, మాజీ సర్పంచ్ కోడిగిరి బాబు, కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, మొగుదాల వెంకన్న, షరీఫ్, మున్సిపాలిటీ యూత్ ప్రెసిడెంట్ కన్నబోయిన నాగరాజు, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు ఏలే శ్రీను , జూలూరు వెంకటేశం, పన్నాల లింగయ్య, కారింగు రామ్మూర్తి, బొమ్మరబోయిన వెంకటేశం, పున్న సైదులు, సమీర్,బుషిపాక సురేష్, కారింగు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు నామకరణం చేయాలి..

### గౌడ సంఘం అధ్యక్షుడు పందుల యాదగిరి గౌడ్ డిమాండ్

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 18(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి కార్యక్రమాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పందుల యాదగిరి గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాలను ఏకం చేసి బహుజన రాజ్యాధికార కోసం పోరాడి 22 కోటలను స్వాధీనం చేసుకొని పరిపాలన చేసిన ధీరశాలి సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు, కావున రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును నామకరణం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాలకుర్ల యాదయ్య గౌడ్, వీరమల్ల యాదయ్య గౌడ్, పాలకూర్ల స్వామి గౌడ్, నీళ్ల గాలయ్య గౌడ్, నీళ్ల యాదయ్య గౌడ్, పెద్దగోని విష్ణు గౌడ్, బద్దం భిక్షం గౌడ్, కొండ నగేష్ గౌడ, మాధగోని బాలరాజు గౌడ్, అయిటిపాముల అంజయ్య గౌడ్, నీళ్ల ముత్యాలు గౌడ్,పట్నం బాలకృష్ణ గౌడ్, నీళ్ల యాదయ్య గౌడ్, జంగయ్య గౌడ్, బొమ్మగాని రమేష్ గౌడ్, బొంగు చంద్రయ్య గౌడ్, బద్దం యాదయ్య గౌడ్, యాదయ్య గౌడ్ బత్తిని మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పల్లె రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి

### బహుజన వీరుడికి పాలాభిషేకం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వేంబావి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగానివాళులర్పించారు.సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, బహుజనుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు వెంకన్న గౌడ్, సర్వాయి పాపన్న అధ్యక్షుడు కొంపెల్లి శివకుమార్ గౌడ్, గురిజే పెంటయ్య గౌడ్, ఉయ్యాల లింగస్వామి గౌడ్, గుణగంటి సత్తయ్య గౌడ్, పానుగుల శంకర్ గౌడ్, ఉయ్యాల సత్తయ్య గౌడ్, కొంపెల్లి భాస్కర్ గౌడ్, గుణగంటి సైదులు గౌడ్, పానుగుల మల్లేష్ గౌడ్, గుణగంటి నరసింహ గౌడ్, గుణగంటి వెంకన్న గౌడ్, సిద్దగాని వెంకన్న గౌడ్, కొంపెల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.




# 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలి

### నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి: మాజీ మంత్రి హరీష్ రావు

### ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి




**క్రైమ్ మిర్రర్,మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించి, ప్రజలకు క్రయవిక్రయాలు మరియు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజ్‌గిరిలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా దాదాపు 30 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి సంపాదించి కొనుగోలు చేసిన భూములను అవసరాల కోసం విక్రయించేందుకు వెళ్లినప్పుడు అవి 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలియడంతో రిజిస్ట్రేషన్లు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల వివాహాలు, ఉన్నత విద్య, వైద్య ఖర్చులు, ఇతర అత్యవసర అవసరాల కోసం తమ సొంత ఆస్తులను విక్రయించుకోవాలనుకున్నా రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, 22ఏ నిషేధిత జాబితాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్య అతిథి హరీష్ రావు మాట్లాడుతూ "సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోంది. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి?" అని ప్రశ్నించారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యు ఎల్ సిను రద్దు చేసిన తర్వాత అనేక భూములు పట్టా భూములుగా మారి, ఏళ్లుగా ప్రజలు వాటిపై హక్కులతో నివసిస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా లేని సమస్యను ఇప్పుడు ఎందుకు సృష్టించారని ప్రశ్నించారు. రంగారెడ్డిలో జీవో 7500 ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో వేలాది భూములు, హెచ్ఎండిఏ, హుడా పరిధిలోని భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా భూములను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. భూమిని విక్రయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే వరకు తమ భూమి 22ఏ జాబితాలో ఉందనే విషయం కూడా ప్రజలకు తెలియడం లేదన్నారు. తిలక్‌నగర్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి తన 450 గజాల ఇంటిని విక్రయించేందుకు వెళ్లిన సమయంలో అది నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలిసిందని, ఈ ఘటన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు ఉదాహరణగా పేర్కొన్నారు. బిగ్ టీవీ జర్నలిస్ట్ అశోక్ తనకు ఎదురైన సమస్యను సోషల్ మీడియా ద్వారా వెల్లడించారని, ఆయన ఒక్కరే కాకుండా అనేక మంది జర్నలిస్టులు, సామాన్య ప్రజలు ఇదే తరహా సమస్యలను ఎదుర్కొంటున్నారని హరీష్ రావు తెలిపారు. "తప్పు చేసి ఇప్పుడు సారీ చెబితే ప్రజల బాధలు తీరుతాయా భూములను జాబితాలో చేర్చింది ఎవరు? ఎవరి ఆదేశాలతో చేర్చారు? అధికారుల పేర్లు చెప్పి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోకూడదు" అని అన్నారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకోకుండా, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పకుండా స్వయంగా పరిశీలించి తొలగించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలు, తొలగించిన భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచి వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ సంబంధిత మంత్రిపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజల్లో అనుమానాలు మరింత బలపడతాయని అన్నారు. "వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పు చేసిన కాంగ్రెస్ నాయకులను చట్టపరంగా బాధ్యులను చేస్తాం. 22ఏ నిషేధిత భూముల సమస్యపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు అండగా నిలుస్తాం" అని హరీష్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, 22ఏ సమస్యతో బాధపడుతున్న వారు తమ సమస్యలను బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, జగదీష్ గౌడ్, శిరీష జితేందర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జీకే హనుమంతరావు, జె.ఎ.సి. వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, భాస్కర్ రెడ్డి, భాగ్యనంద్ రావు, ఉస్మాన్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, చిన్నం శ్రీనివాస్, రమేష్, రాజు యాదవ్, శోభన్ బాబు, ఢిల్లీ పరమేష్, సురేష్, బాలకృష్ణ, ఫరీద్, వంశీ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి, జక్కుల కిరణ్, అనిల్, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ యాదవ్, కిట్టు, బిక్షపతి, కనకరాజు, ఖలీల్, భాగ్యనందరావు, దినేష్, నవాబ్, మహేష్, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, 22ఏ నిషేధిత జాబితా బాధితులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో హాజరై 22ఏ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష సమావేశం




**చిట్యాల ,ఆగస్ట్ 18 :** చిట్యాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, రోడ్లు, తాగునీరు, ప్రజా సేవలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వినోద్ కుమార్, ఎంపీడీవో జెల్ల పాండు, ఎమ్మార్వో విజయ్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్, మండల సర్పంచులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన మీ సేవ కేంద్రాల నిర్వహణకు దరఖాస్తు ఆహ్వానం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామం,శాలిగౌరారం మండలంలోని తక్కెళ్ళ పహాడ్ గ్రామంలో నూతన మీ సేవ కేంద్రాల నిర్వహణకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయం లోని మీసేవ విభాగంలో దరఖాస్తు ఫారం తీసుకొని కంప్యూటర్ పరిజ్ఞానం కి సంబంధించిన సర్టిఫికెట్లు,విద్యార్హత (గ్రాడ్యుయేట్), జనన ధ్రువీకరణ లేదా ఎస్ ఎస్ సి మెమో,ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్,రెండు పాస్ ఫోటోలు,పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ల జిరాక్స్ లను జత చేసి ఈ నెల 27 వరకు సమర్పించాలని అర్హులకు రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగష్టు 18(క్రైమ్ మిర్రర్):** వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తుల కు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బొడిగేసుదర్శన్, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, పల్లెర్ల రామచందర్, గౌడ సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పాలకూర వెంకటేశం, పబ్బు సురేందర్, కంకల కిష్టయ్య, బత్తిని దేవేందర్, కొండూరు సాయి, శ్రీరాములు,బొడిగె సాయిలు, మునుకుంట్ల బిక్షపతి, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.




# పీఏసీ సమావేశంలో పార్టీ బలోపేతంపై కీలక చర్చలు

### ఎస్ ఐ ఆర్ తో పాటు పార్టీ వ్యవహారాలపై సమగ్రంగా చర్చించిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీకి సంబంధించిన పలు కీలక అంశాలపై మంగళవారం పీఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్థాయి నాయకులు, పార్టీ ముఖ్య నేతలు హాజరై ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యలు, సర్ ప్రక్రియ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా ఎస్ ఐ ఆర్ అంశంపై నాయకులు సమగ్రంగా చర్చించారు. ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు, ప్రజలకు అవసరమైన సమాచారం అందించడం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై చర్చించారు. సంబంధించిన అంశాలను గ్రామ, మండల, పట్టణ స్థాయిలో ప్రజలకు వివరించి, వారికి అవసరమైన సహకారం అందించాలని నాయకులు సూచించారు..అదేవిధంగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. పార్టీ కార్యకర్తలతో నాయకులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని నాయకులు సూచించారు. ప్రజలకు మరింత చేరువగా పార్టీ కార్యక్రమాలను తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడం వంటి అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించాలని నాయకులు పేర్కొన్నారు. ఇక రాబోయే రోజుల్లో పార్టీ నిర్వహించాల్సిన కార్యక్రమాలు, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణ, కార్యకర్తల సమన్వయం, ప్రజా




సమస్యలపై ఉద్యమాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలపై కూడా నాయకులు చర్చించి అవసరమైన దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలమైన పునాది ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేసే పార్టీగా ప్రజల సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తూ, వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ కార్యకలాపాలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పీఏసీ సమావేశం ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు స్పష్టమైన దిశానిర్దేశం చేసుకున్నారు. ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గౌరవ ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ గారు, శ్రీ సంపత్ గారు, శ్రీమతి సరిత యాదవ్ గారుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్వేతా అగర్వాల్ జన్మదిన వేడుకల సందర్భంగా పేద పిల్లలకు మధ్యాహ్న భోజనం వితరణ

**క్రైమ్ మిర్రర్, ఆగస్టు 18:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సరోర్‌నగర్‌లోని పేద పిల్లల పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. యమునానగర్ నివాసి శ్రీమతి శ్వేతా అగ్రవాల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు, అధికారులు పాఠశాలలోని పేద పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి శ్వేతా అగ్రవాల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించారు. పిల్లలు సైతం శ్వేతా అగ్రవాల్‌కు ప్రేమతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. శ్వేతా అగ్రవాల్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, ఆమె వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మానవ సేవే మాధవ సేవ, సేవా పరమో ధర్మః అనే నినాదాలతో సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను చాటారు. జన్మదినం, వివాహ వార్షికోత్సవం లేదా ఇతర శుభ సందర్భాలను సేవా కార్యక్రమాలుగా నిర్వహించాలనుకునే వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



# పేదింటి ప్రతిభకు విదేశీ గమ్యం.. ఆర్థిక సాయమే ఇప్పుడు ఆసరా

**కష్టాల కడలిలో కలల కిరణం.. చంద్రికకు చేయూతనిస్తే ఉజ్వల భవిష్యత్తు**

**కూలీ కుటుంబం నుంచి అరుదైన అవకాశం.. అండ కోసం ఎదురుచూపు**

**అవకాశం తలుపుతట్టింది.. ఆర్థిక భారంతో ఆగిన అడుగులు**

**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని నిరూపిస్తూ, చదువులో రాణించిన నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, రాంరెడ్డిపల్లి గ్రామంలోని అవాస గ్రామమైన తానేదార్పల్లికి చెందిన పల్లేటి చంద్రిక, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించే అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుంది. హైదరాబాద్‌లోని సాహితి కళాశాలలో డిగ్రీ విద్యను పూర్తి చేసిన చంద్రిక, ఉన్నత చదువుల కోసం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో ఉన్న, యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ లో ఎంబీఏ చదివేందుకు సీటు సాధించింది. చంద్రికకు ఎంబీఏ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విత్ ప్లేస్‌మెంట్ కోర్సులో, పూర్తి కాల విద్యార్థిగా ప్రవేశానికి విశ్వవిద్యాలయం నుంచి అన్‌కండిషనల్ ఆఫర్ లెటర్ జారీ అయింది. 2026 సెప్టెంబర్ 21న కోర్సు ప్రారంభం కానుండగా, 2028 మే 19 నాటికి కోర్సు పూర్తయ్యేలా విద్యా ప్రణాళిక ఉంది. దీంతో చంద్రిక కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తున్నప్పటికీ, లండన్ చదువుకు అవసరమైన భారీ మొత్తాన్ని సమకూర్చుకోవడం కుటుంబానికి పెద్ద సవాల్‌గా మారింది.

**కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు.. కూతురి కల నెరవేర్చాలనే తపన**

చంద్రిక తల్లి పద్మ, తండ్రి యాదయ్య కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. కుటుంబంలో పెద్ద కూతురైన చంద్రిక చిన్నప్పటి నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, పరిమిత ఆర్థిక పరిస్థితుల్లోనూ పట్టుదలతో ముందుకు సాగింది. కూతురు లండన్‌లో ఎంబీఏ చదివే స్థాయికి ఎదగడం తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణంగా ఉన్నప్పటికీ, చదువు, వీసా, ప్రయాణం, వసతి, జీవన వ్యయాలు తదితర ఖర్చులను భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమ బిడ్డకు వచ్చిన ఈ అరుదైన అవకాశాన్ని కేవలం డబ్బుల కొరత కారణంగా కోల్పోవాల్సి వస్తుందేమోననే బాధ వారిని వెంటాడుతోంది. చంద్రికకు యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ నుంచి అందిన ఆఫర్ లెటర్ ప్రకారం, మిగతా ఖర్చులు ఏమో కానీ 2026/27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ కోర్సు ట్యూషన్ ఫీజు 19,500 పౌండ్ ల వరకు ఖర్చు కానుంది. చంద్రికకు లభించిన ఈ అవకాశం ఒక్క



కుటుంబానికే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా పట్టుదలతో చదివితే అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో సీటు సాధించవచ్చని చంద్రిక తన ప్రతిభతో నిరూపించింది. అయితే ఇప్పుడు ఆమె ముందు ఉన్న ప్రధాన అడ్డంకి ప్రతిభ కాదు.. ఆర్థిక పరిస్థితి. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తల్లిదండ్రులు, తమ శక్తికి మించి ప్రయత్నిస్తున్నప్పటికీ, లండన్ చదువుకు అవసరమైన ఖర్చును పూర్తిగా భరించడం వారికి సాధ్యపడటం లేదు. అందుకే చంద్రిక తల్లిదండ్రులు మనసున్న దాతలు, విద్యాభిమానులు, సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి, తమ కుమార్తె ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక విద్యార్థి జీవితాన్ని మార్చే సహాయం.. ఒక కుటుంబం భవిష్యత్తును మార్చడమే కాకుండా, మర్రిగూడ మండలం నుంచి లండన్ వరకు సాగుతున్న చంద్రిక విద్యా ప్రయాణానికి కొత్త దారి చూపగలదు. ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో వెనుకబడే ఇలాంటి, విద్యార్థులకు దాతలు సహాయాన్ని అందించాలని కోరుతున్నారు. “మా బిడ్డకు వచ్చిన ఈ అవకాశం డబ్బుల కొరతతో ఆగిపోకూడదని, మనసున్న పెద్దలు ముందుకు వచ్చి సహాయం చేస్తే చంద్రిక తన లక్ష్యాన్ని చేరుకుంటుందని, చంద్రిక తల్లిదండ్రులు కోరుతున్నారు.

## స్వామి తల్లి మృతి పట్ల సంతాపం తెలిపిన:కాటం వెంకటేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్ మోర స్వామి తల్లి (85) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ ఓర్సు సైదులు, ఏర్పుల యాదయ్య, గంట రవీందర్ రెడ్డి, బుంగపట్ల తిమ్మయ్య, భైరవని బిక్షం, గుండెబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 18:** సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ పాండు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన హక్కులు, స్వేచ్ఛ లభించాలనే లక్ష్యంతో పాపన్న గౌడ్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.



## గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 18(క్రైమ్ మిర్రర్):** వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తుల కు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి,గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పబ్బు స్వామి గౌడ్, బత్తిని దేవేందర్ గౌడ్, మారగోని సత్యనారాయణ, రాగిర్ మధు, బత్తిని నరసింహ,బందరాపు లింగస్వామి, పబ్బు సురేందర్, పంజాల రమేష్,కొండూరు వెంకన్న, శ్రీరాములు, పాలకూర వెంకటేశం, మారగోని శ్రీనివాస్, బొడిగె సుదర్శన్, బత్తినిశేఖర్ ,బత్తిని శెట్టయ్య, కొండూరు సాయి, పబ్బు మల్లయ్య సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ నైపుణ్య పాఠశాలల్లో విద్యార్థులకు సీఆర్పిల స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహణ

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం మునుగోడు మండలం కొంపల్లి కాంప్లెక్స్ లోని ఎఫ్.ఎల్.ఎన్ నైపుణ్య పాఠశాలలు ప్రాథమిక పాఠశాల కొంపల్లి మరియు ప్రాథమిక పాఠశాల చొల్లేడులో 2వ తరగతి విద్యార్థులకు స్కూలు ఎడ్యుకేషన్ ఆప్ ద్వారా స్పాట్ అసెస్‌మెంట్ ను సి. హెచ్.నాగరాజు,క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నిర్వహించారు. విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత,పఠనం,రచన, గణిత నైపుణ్యాలను యాప్‌లో నేరుగా నమోదు చేస్తూ వారి అభ్యాస స్థాయిని తక్షణమే అంచనా వేస్తున్నారు.ప్రతి విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా తదుపరి బోధన ప్రణాళిక రూపొందించేందుకు ఈ మూల్యాంకనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనలో భాగంగా ప్రతి విద్యార్థి నేర్చుకునే ఫలితాలను మెరుగుపరచడమే ఈ స్పాట్ అసెస్‌మెంట్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి,చొల్లేడు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు గడ్డం.వెంకటయ్య, ఈసారపు. యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

